


స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం


స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.700 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.720 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాముకి ఎగువన 26.800 మీటర్లు, దిగువ కాపర్ డ్యాముకి దిగువన 15.690 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

ధరలు దిగొచ్చేదెప్పుడో..!



- మండుతున్న నిత్యావసరాల ధరలు
- అదే బాటలో కాయగూరలు
- సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు విలవిల
- ధరల నియంత్రణకు సహకరించాలని వర్తకులను కోరుతున్న అధికారులు
- ధరలు నియంత్రించేది ఇలాగేనా అంటూ ప్రజల్లో విస్తృత చర్చ

ప్రజాశక్తి - భీమవరం

బహిరంగ మార్కెట్లో నిత్యావసరాలతోపాటు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో ఆదాయానికి, పెరిగిన ధరలకు పొంతన లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణకు సహకరించాలని వర్తకులను కోరింది. రైతుబజార్లు, రిలయన్స్, డీమార్ట్ వంటి సూపర్ మార్కెట్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేసింది. ఈ నెల 12వ తేదీలోపు అన్ని రకాల పప్పుల నిల్వలు వెబ్ పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించింది. అయితే ఈ చర్యలతో ధరల నియంత్రణ సాగుతుందా అనే అనుమానాలు జనాల్లో నెలకొన్నాయి.

ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో నిత్యావసరాల ధరలు కొండెక్కాయి. మార్కెట్లో ఏం కొనాలన్నా వందల్లోనే చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని అంతా గగ్గోలు పెడుతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధరలను నియంత్రిస్తామని చెప్పినా ఆచరణలో లేకపోవడంతో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని వర్తకులే చెబుతున్నారు. ప్రస్తుతం కందిపప్పు కిలో రూ.180, మినపగుళ్ల కిలో రూ.140, టీ పొడి కిలో రూ.400 నుంచి రూ.500, పల్లీలు కిలో రూ.140, వెల్లుల్లి కిలో రూ.300, చింతపండు కిలో రూ.140, ఆయిల్ కిలో రూ.120 నుంచి రూ.180 వరకూ పలుకుతోంది. ఇక నెల రోజులుగా కూరగాయల ధరలు కూడా వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. వారం రోజుల క్రితం కిలో టమాటా రూ.80పైనే విక్రయించగా ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. మిర్చి రూ.50, దొండకాయలు రూ.30, బెండకాయలు రూ.40, కేరెట్ రూ.50, దోస రూ.30, బీట్‌రూట్ రూ.60, బీరకాయలు రూ.80, వంకాయలు రూ.50, బంగాళాదుంపలు రూ.50, చిక్కుళ్లు రూ.80, బీన్స్ రూ.100, కాకర రూ.80 పలుకుతున్నాయి. కొన్నిరోజుల క్రితం ఉల్లిపాయ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కిలో ఉల్లి రూ.65 వరకు విక్రయించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి రావడంతో ధర దిగొస్తుంది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో ఉల్లిని రూ.40 వరకు విక్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెంలో ఉల్లి మార్కెట్లో దిగుమతులు పెరగడంతో ఉల్లి వ్యాపారులు ప్రస్తుతం మూడు కిలోలు రూ.వందకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణపై సరైన వ్యవస్థ లేకపోవడంతో ఎప్పుడు పెరుగుతాయో.. ఎప్పుడు తగ్గుముఖం పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వేసవిలో విపరీతమైన ఎండలు, వేడి గాలులు కారణంగా కొన్నిచోట్ల కూరగాయ తోటలు మొక్కదశలోనే ఎండిపోవడం, కాయదశలో రాలిపోవడం వంటివి జరిగినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ధరలు పెరిగాయి.

ధరల నియంత్రణ ఇలాగేనా

బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల, కూరగాయల ధరల నియంత్రణకు జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకదారులతో సమావేశమయ్యారు. నిత్యావసరాల ధరల స్థిరీకరణపై సమీక్షించారు. జిల్లాలోని అన్ని రైతుబజార్లు, డీమార్టు, రిలయన్స్, సూపరు మార్కెట్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, రేట్లు వివరాలను అందరికీ కన్పించేలా బోర్డులు డిస్ప్లే చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బియ్యం, కందిపప్పును మార్కెట్ ధర కంటే తక్కువకు విక్రయించాలని ఆదేశించారు. స్టీమ్ రకం బియ్యం కిలో రూ.49, ముడి రకం బియ్యం కిలో రూ.48, కందిపప్పు (దేశవాళి) కిలో రూ.160గా నిర్ణయించారు. రైస్, పప్పులు, ఆయిల్, కూరగాయలు, రిటైల్ వ్యాపారస్తులకు ఉల్లి, టమాటా ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను జెసి ఆదేశించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో దళారీ వ్యవస్థ రాజ్యమేలుతున్న తరుణంలో ధరల నియంత్రణ ఇలాగేనా అనే చర్చ సాగుతోంది. జెసి ఆదేశాలను వర్తకులు పాటిస్తారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంతోపాటు తరచూ తనిఖీలు, దాడులు చేయడం ద్వారానే ధరలు ఎంతోకొంత అదుపులో ఉండే అవకాశం ఉందని జనం అభిప్రాయపడుతున్నారు.

ధరల నియంత్రణకు వర్తకులు సహకరించాలి

సివి.ప్రవీణ్‌ఆదిత్య, జాయింట్ కలెక్టర్



బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరల నియంత్రణకు వర్తకులు సహకరించేందుకు ముందుకు రావాలి. సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వర్షాకాలం నేపథ్యంలో ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకుని నిత్యావసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. కొంతమంది వ్యాపారస్తులు నిత్యావసరాలను ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నారు. ఇది సరికాదు. ప్రజలకు మంచి చేయాలనే దృక్పథం అమ్మకందారుల్లో ఉండాలి.

కౌలురైతులు, వీధి వ్యాపారులకు రుణాలివ్వాలి

డ్వాక్రా సంఘాల బలోపేతంలో బ్యాంకర్లదే కీలకపాత్ర

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

మానవతా దృక్పథంతో కౌలురైతులు, వీధి వ్యాపారులు, ఎస్‌హెచ్‌జి గ్రూపుల ఆర్థిక తోడ్పాటుకు సులభంగా రుణాలిచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో 2024-25 మొదటి త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రుణాల లక్ష్య సాధనపై బ్యాంకర్లతో ఆమె సమీక్షించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యం రూ.18,256 కోట్లు నిర్దేశించామని, లక్ష్యాలు సాధించేలా అధికారులు దృష్టి సారించాలని అన్నారు. కౌలురైతులకు సులభ రీతిలో రుణాలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. పిఎం స్వానిధి అమలుపై ప్రత్యేక దృష్టిపెట్టి లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. రుణం కోసం ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. దరఖాస్తులు తిరస్కరించాల్సి వస్తే అందుకుగల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి ఆయా పథకాల కింద పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆయా దరఖాస్తుల్లో లోటుపాట్లు ఉంటే సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుని నిబంధనల మేరకు వాటిని పూర్తి చేయడం ద్వారా లబ్ధిదారులకు రుణాలందించేలా చూడాలని సూచించారు. విద్యా రుణాలను విరివిగా అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ముద్ర యోజన కింద రుణాల మంజూరుపై పూర్తి దృష్టి సారించాలన్నారు. యూనియన్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా మరిన్ని ఉపాధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ద్వారకాతిరుమల వంటి ప్రసిద్ధ క్షేత్రాల్లో ప్రసాదాల పంపిణీకి వినియోగించే విస్తర్లు వంటివి తయారీపై గిరిజన ప్రాంతాల్లో మహిళలకు శిక్షణనిచ్చి ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి జీవనోపాధికి దోహదపడాలని సూచించారు. ఆవులు, గేదెల యూనిట్ల ఏర్పాటుకు విరివిగా రుణాలు అందించాలని, ఈ విషయంలో తిరస్కరణకు గురైన దరఖాస్తుల్లో ఏమైనా లోపాలుంటే లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ పథకాల లక్ష్యాల సాధనలో కొన్ని బ్యాంకుల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

బ్యాంకర్లను అభినందించిన కలెక్టర్

జులైలో సామాజిక పెన్షన్ల సొమ్ము విడుదల చేయడంలో బ్యాంకర్ల కృషిని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలోనూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బిఐ ఎల్‌డిఒ పూర్ణిమ, ఎల్‌డిఎం డి.నీలాద్రి, నాబార్డ్ డిడిఎం అనిల్‌కాంత్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, వ్యవసాయశాఖ జెడి ఎస్‌కె అబీబ్‌భాషా, పశు సంవర్ధకశాఖ జెడి జి.నెహ్రూబాబు, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలివ్వాలని ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులకు తక్షణమే మే, జూన్ నెల వేతనాలు చెల్లించాలని ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కె.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సమగ్రశిక్ష అభియాన్ జిల్లా కార్యాలయం వద్ద పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ సమ్మె కాలం జీతం, సమ్మె అగ్రిమెంట్స్ అమలు, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న అన్ని విభాగాలకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, కొత్త డిఎస్‌సిలో వెయిటేజ్ ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వేజ్ సిబ్బందిని వెంటనే రెన్యువల్ చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, కరవు భత్యం, ఇంటి అద్దె సౌకర్యం, గ్రాట్యూటీ కల్పించాలని కోరారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో వేతనాలు విడుదల కాక ఉద్యోగులు చాలా ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా మహిళా కార్యదర్శి బి.రాజ్యలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు సోమరాజు, జిల్లా కమిటీ సభ్యులు మణికంఠరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

మండవల్లి: సకాలంలో జీతాలు అందించి తమను ఆదుకోవాలని ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద పెండింగులో ఉన్న జీతాలు అందించాలని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమారి, ఎం.వెంకటరత్నం, సుంది బాబు, సుబ్రహ్మణ్యం, అప్పారావు, భగవాన్, నాగరాజు, నాగలక్ష్మి, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: సమగ్ర శిక్ష సిబ్బందికి మే, జూన్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, గత సమ్మెకాలం జీతం ఇవ్వాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.వీరాస్వామి, జ్యోతి ప్రకాష్, మహేశ్వర, పుల్లారావు, సతీష్, అడపా సత్యనారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డున్న ప్రతి రోగికీ ఉచిత వైద్యం

ఆసుపత్రులు అదనంగా డబ్బు వసూలు చేస్తే చట్టప్రకారం చర్యలు

ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.రాజీవ్

ఏలూరు: ఆరోగ్యశ్రీలో అదనంగా డబ్బు వసూలు చేస్తే ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.రాజీవ్ తెలిపారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ వర్తింపు కలిగిన 31 ప్రయివేట్ ఆసుపత్రుల్లో రోగులకు అందుబాటులో ఆరోగ్యమిత్రలు ఉన్నారన్నారు. ఓపిలో అవుట్ పేషెంట్ విభాగంలో టెస్టులు ఉచితంగానే చేయిస్తారని, ఎటువంటి రుసుము చెల్లించనక్కర్లేదని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఓపిలో ఖర్చు పెట్టుకున్న సొమ్ము ఆరోగ్యశ్రీలో ఐపి అయితే ఖర్చు పెట్టిన సొమ్మును కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో ఉన్న ప్రతిఒక్క రోగికీ అదనంగా డబ్బు వసూలు చేయడం జరగదని, ఒకవేళ అటువంటి చర్యలకు పాల్పడితే ఆరోగ్యమిత్ర వారు రోజూ ఆన్‌బెడ్‌కు వెళ్లినప్పుడు రోగి మా దగ్గర అదనంగా డబ్బు వసూలు చేశారని రాతపూర్వకంగా తెలియజేస్తే వెంటనే వాళ్ళ ఖర్చు పెట్టిన సొమ్ము తిరిగి ఇప్పించడంతోపాటు సంబంధిత ఆసుపత్రులపై తగుచర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులేని వారికి కూడా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం లేఖద్వారా కూడా ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందుతుందన్నారు.

విజయవాడలో సిపిఎం ఆధ్వర్యాన

14న పోలవరం నిర్వాసితుల సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 14న విజయవాడలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోలవరం నిర్వాసితుల పునరావాసం కోసం సిపిఎం ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టి పని చేయడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అయితే ఆ పోలవరానికి భూములిచ్చి తమ సర్వస్వాన్ని కోల్పోయిన నిర్వాసితుల గురించి పట్టించుకోకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి పర్యటన సందర్భంగా, ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల సందర్భంగా, సమీక్షా సమావేశాల సందర్భంగా, కొత్త మంత్రివర్గ సమావేశం సందర్భంగాగాని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి చర్చించారే తప్ప జల సమాధి అవుతున్న పోలవరం నిర్వాసితులకు జరిగిన నష్టం గురించిగాని, వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం గురించిగాని, కల్పించాల్సిన పునరావాసం గురించిగాని మాట్లాడకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ముందుగా నిర్వాసితుల సమస్యపై, ఆ తర్వాత ప్రాజెక్ట్‌పైన దృష్టి పెట్టి పని చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ విషయాలు రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలిపేందుకు ఈ నెల 14న ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సుకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడతారని తెలిపారు. ఏలూరు జిల్లాలోని పోలవరం నిర్వాసితులంతా ఈ సదస్సుకు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 'డిమాండ్స్ డే'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏలూరు: కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

కార్మిక సమస్యలు పరిష్కరించాలని దేశవ్యాప్త పిలుపులో భాగంగా డిమాండ్స్ డే కార్యక్రమాన్ని బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని, టిడిపి ప్రభుత్వం కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు నగర కార్యదర్శి వి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దుచేసి, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.జగన్నాథం, జె.గోపి, విజిఎంఆర్ కృష్ణారావు, జి.రవి కిషోర్, రజిని, భవాని, పి.కిషోర్, వెంకటరమణ ప్రసంగించారు.

భీమడోలు: మండల పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు సిఐటియు పిలుపుమేరకు దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా సిఐటియు మండల నాయకులు కె.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షురాలు జి.స్వర్ణ కుమారి ఆధ్వర్యంలో కార్మికులు భీమడోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ వరాహలయ్యకు తమ వినతులతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత ర్యాలీగా బయలుదేరిన కార్మికులు ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తమ వినతులతో కూడిన వినతి పత్రాన్ని సిడిపిఒ విజయలక్ష్మికి అందజేశారు.

నిడమర్రు: నిడమర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు కోర్కెలు దినోత్సవం సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు ఆధ్వర్యాన నిరసన తెలిపి తహశీల్దార్ కె.పోసీబాబుకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల పార్వతి, సుభాషిని, వెంకటలక్ష్మి, ఎం.నాగలక్ష్మి, పిల్ల హరి కుమారి, సిహెచ్.శివ, చంద్రరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్: సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు సూర్యారావు, సుభాషిణి పాల్గొన్నారు.


టి. నరసాపురం : సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం వివిధ డిమాడ్లతో కూడిన వినతిని తహశీల్దార్ శుభాష్‌కు అందజేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు ఫణివర్ధిని, కార్యకర్తలు నాగమణి, సంధ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

ముసునూరు: సిఐటియు మండల నాయకులు పల్లిపాము రాజకుమారి ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ వి.కుమారికి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.రాజకుమారి, శ్రీదేవి, శ్రీలక్ష్మి, మేరి సులోచన, కుమారి, విద్యావతి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సిఐటియు మండల కార్యదర్శి రాజులపాటి చంటి ఆధ్వర్యాన తమ సమస్యలను పరిష్కరించాలని మండల తహశీల్దార్ బి.మృత్యుంజయరావుకు బుధవారం వినతిని అందజేశారు. సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, ఆశా వర్కర్స్ సునీత, నీలాంబరం, అంగన్‌వాడీ వర్కర్స్ పుల్లమ్మ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహశీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం డిటి రమేష్‌కి వినతి పత్రం అందజేశారు. పుష్ప, నూర్జహాన్, మున్ని, మంగ, అనురాధ, తదితర కార్మికులు పాల్గొన్నారు.


నూజివీడు టౌన్: తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన..

చాట్రాయి : సిఐటియు ఆధ్వర్యాన డిమాండ్స్ డే సందర్భంగా సమస్యలతో కూడిన వినతిని మండల తహశీల్దార్ మహమ్మద్ ముక్సుద్ ఆలీకి అందజేశారు. అంగన్వాడీ మండల అధ్యక్షురాలు కొప్పుల ప్రమీలరాణి, మండల కమిటీ సభ్యురాలు మేడూరి కుసుమకుమారి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఆకునూరి నిర్మల జ్యోతి, ఆశా కార్యకర్తలు ఎస్.పుల్లమ్మ, వై.లక్ష్మీ మాణిక్యం, సిఐటియు మండల కన్వీనర్ మేడేపల్లి హెూలీ మేరీ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన డిమాండ్స్ డే సందర్భంగా తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల: సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి, తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు అనంతలక్ష్మి, నాగలక్ష్మి, హేమలత, స్వర్ణలత పాల్గొన్నారు.

ఉంగుటూరు: సంఘటిత రంగ కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేసి డిప్యూటీ తహశీల్దార్ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. సిఐటియు నాయకులు సుజాత పాల్గొన్నారు.

చింతలపూడి : తమ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. సీనియర్ నాయకులు సూర్య కుమార్, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు తహశీల్దార్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్స్, ట్రిపుల్ ఐటీ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాజు, పట్టణ అధ్యక్షులు హనుమాన్లు, మున్సిపల్ కార్మికులు ఉమా, ఉషారాణి, అంగన్వాడీ, ఆశా వర్కర్స్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కామవరపుకోట: మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, అంగన్వాడీ వర్కర్స్ పుష్పరాజ్యం, సరళ, శాంతి, అరుణ, ప్రియాంక, పద్మ, మంగతాయారు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కలిదిండి : సిఐటియు ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, తహశీల్దార్ వంశీకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు షేక్ అభిదాబేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, బండి పుష్ప, విజయ లక్ష్మి, రాజమణి పాల్గొన్నారు

పోలవరం : అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చాలని అంగన్వాడీ వర్కర్ల సంఘం మండల నాయకురాలు పిఎల్ఎస్ కుమారి డిమాండ్ చేశారు. తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు మండల డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు అరుణ, పద్మ, మణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా మెలగాలి

డిఇఒ ఎస్.అబ్రహాం


శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులతో డిఇఒ

భీమడోలు: ఉపాధ్యాయులు వృత్తిని ప్రేమిస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా విద్యాధికారి ఎస్.అబ్రహం కోరారు. భీమడోలు హై స్కూల్ వేదికగా ఎంపిక చేసిన గత తొమ్మిది రోజులుగా ఐదు మండలాల్లోని 52 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు తొమ్మిది రోజులపాటు కొనసాగిన టచ్ టూల్ శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి ఉపాధ్యాయుల పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయుల తాము పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి తగు ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం టచ్ టూల్ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు తాము తీసుకొన్న శిక్షణ, వారి వృత్తినైపుణ్యం పెరిగేందుకు సహకరిస్తుందన్నారు. వీటిని వారు తమతో పాటు పనిచేసే ఇతర ఉపాధ్యాయులకు తెలియజేసి తరగతి గదులలో వాటి అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత స్టూడెంట్స్ కిట్స్ గోదాంని తనిఖీ చేశారు. వివిధ అంశాల గురించి మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర కుమార్‌లతో చర్చించారు. శిక్షణా తరగతులకు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించిన షేక్ మస్తాన్, ఎస్.పెద్దిరాజులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం అహ్మద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చిమ్మిన వేడి నూనె

నూజివీడు టౌన్: పట్టణంలోని అప్సర థియేటర్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగిలి వేడి నూనె బయటికి రావటంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. పట్టణంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న ఘటనలో అటుగా వెళుతున్న ద్విచక్ర వాహన చోదకుడు పై వేడి నూనె పడబోయే సమయానికి వెంటనే గ్రహించి వాహనాన్ని వదిలి పరుగులు తీశారు. ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ పట్ల విద్యుత్ అధికారులు శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.


ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

విద్యార్థుల బస్‌పాస్‌లకు సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలో బుధవారం చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగ రోషన్ కుమార్ పర్యటించారు. చక్రధామ చక్ర దేవరపల్లి ప్రాజెక్టు వర్క్ రహదారి నిలవడానికి శంకు స్థాపన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగానే నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ వారి సౌజన్యంతో విద్యార్థులకు బస్సు పాస్‌ల నిమిత్తం, రూ.3 లక్షల చెక్కులు ఎంఎల్‌ఎ రోషన్ కుమార్ సమక్షంలో ఆర్‌టిసి అధికారులకు నవభారత్ కంపెనీ ఫ్యాక్టరీ యాజమాన్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థి నాయకుల ఎన్నిక

కొయ్యలగూడెం : జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పరింపూడి, కొయ్యలగూడెంలో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థి నాయకుల ఎన్నికలు ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారని బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. ఎన్నికలు స్ఫూర్తిని తలపించేలా జరిగాయని, విద్యార్థినులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ నాయకులను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. ఎన్నికైన విద్యార్థినులు పాఠశాల క్రమశిక్షణలో తమ వంతు పాత్ర నిర్వహిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన మొదటి విద్యార్థి నాయకురాలు పులిబోయిన పూర్ణిమను ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఉమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

డాగ్యూరే ధన్యజీవి

భీమడోలు: ఫొటోగ్రాఫర్లకు సమాజంలో గౌరవ ప్రతిష్టలు కల్పించడంతోపాటు, వారి ఉపాధికి సహకరిస్తున్న ఫొటోగ్రఫీ సృష్టికర్తల్లో ఒకరైన లూయిస్ డాగ్యూరే ధన్యజీవి అని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమడోలు లోని అబ్దుల్ కలాం, డాగ్యూరే వేదిక వద్ద బుధవారం డాగ్యూరే 173వ వర్ధంతి కార్యక్రమాన్ని యూనియన్ అధ్యక్షులు డి.శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు డాగ్యూరే విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఆయనకు నివాళులు సమర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.రామ్మూర్తి, ఎ.రంగారావు, నరేష్ పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ అందుబాటులో ఉండాలి

ధర్నాలో పివైఎల్ నాయకులు

బుట్టాయగూడెం : కెఆర్ పురం ఐటిడిఎలో ప్రతి బుధవారం గిరిజన దర్బార్‌ను నిర్వహించాలని, పిఒ అందుబాటులో ఉండాలని పివైఎల్ డివిజన్ కార్యదర్శి, సహాయ కార్యదర్శి గురుగండ్ల ప్రసాద్ రెడ్డి, తగరం బాబురావు అన్నారు. ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం కోట రామచంద్రపురం ఐపిడిఎ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పివైఎల్ డివిజన్ కార్యదర్శి, సహాయ కార్యదర్శి గురుగండ్ల ప్రసాద్ రెడ్డి, తగరం బాబురావులు మాట్లాడుతూ ప్రతి బుధవారం ఐటిడిఎకు 60.. 70 కిలోమీటర్ల నుంచి ప్రజలు తమ సమస్యలు చెప్పుకుందామని గిరిజన దర్బారుకు వస్తుంటే ఐటిడిఎ పిఒ అందుబాటులో లేక సమస్యలతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారన్నారు. సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయని, కాబట్టి ప్రతి బుధవారం గిరిజన దర్బార్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు స్టేట్ ప్రెసిడెంట్ యు.భూషణం, కట్టం నాగేశ్వరరావు, జి.లక్ష్మీనారాయణ, నడపాల మక్కారెడ్డి పాల్గొన్నారు.

దుకాణాలు ఖాళీ

నూజివీడు టౌన్: ఏళ్ల తరబడి అద్దెలు చెల్లించకుండా దుకాణాలు నడుపుతున్న వారిని హైకోర్టు తీర్పుతో అధికారులు ఖాళీ చేయించారు. నూజివీడు పట్టణంలోని స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని దుకాణాలను మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నడుస్తున్న హోటల్స్, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, ఇతర దుకాణాలు ఖాళీ అయ్యాయి. దీంతో నిత్యం సామాన్య ప్రజానీకంతో కళకళలాడుతూ ఉండే ప్రాంతం నేడు వెలవెల పోయింది.

ప్రజల పక్షాన పోరాటం చేయాలి : జగన్

చింతలపూడి: కార్యకర్తలందరికీ తోడు ఉంటానని, భయపడకుండా ప్రజలప్రక్షాన పోరాటం చేయాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారని వైసిపి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిర్యాల దిలీప్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దినేష్ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తీర్పును గౌరవించాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని ఆయన చెప్పినట్లుగా తెలిపారు.

కామవరపుకోట: కార్యకర్తలు అధైర్య పడవద్దు, మనోధైర్యం కోల్పోవద్దు అని మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దాసి పండు తాడేపల్లిలోని మాజీ సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజవర్గంలోని రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారని తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్ డ్రైవ్

జీలుగుమిల్లి : దోమల నివారణకు మండల వ్యాప్తంగా ఫాగింగ్ డ్రైవ్ చేపట్టినట్లు ఎంపిడిఒ కెఎమ్.మంగతాయారు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పాటు ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తుండటంతో దోమల తీవ్రత పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా ఆయా గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. జీలుగుమిల్లి పంచాయతీ పరిధిలోని పరిసర గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది అధ్వర్యంలో మొదటి విడత ఫాగింగ్ డ్రైవ్ పూర్తయినట్లు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

నూజివీడు టౌన్: మండలంలోని నూజివీడు రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారుల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ కె.వెంకటేశ్వర్లు, నూజివీడు డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు 47 బృందాలుగా ఏర్పడి 2,955 గృహ సర్వీసులు, 113 వాణిజ్య సముదాయాలు, 7 పారిశ్రామిక సర్వీసులు తనిఖీ చేశారు. వాటిలో 175 సర్వీసులకు అదనపు లోడు మొత్తానికి రూ.5.42 లక్షలు, 3 సర్వీసులకు విద్యుత్ చౌర్యం చేసినందుకు రూ.11 వేల జరిమానా విధించడం జరిగింది. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే ఈ క్రింది నెంబర్లకు 9440812362, 94408110489, 8331014951 సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అవకాశమివ్వండి

టిడిపి మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ వినతి

కామవరపుకోట: చింతలపూడి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ రామకృష్ణలకు టిడిపి మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఛైర్మన్ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వ్యర్థాలను నదిలో, పార్కులో వేయరాదు'

ప్రజాశక్తి - పోలవరం

పాపికొండల పర్యాటక బోట్ల యజమానులకు, నిర్వహకులకు బుధవారం పోలవరం అటవీ క్షేత్రాధికారి ఎన్.దావీదురాజు ఆధ్వర్యంలో స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీక్షేత్రాధికారి మాట్లాడుతూ పాపికొండల టూరిజం సందర్భాల్లో బోట్లలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు, డ్రింకు బాటిళ్లు గోదావరి నదిలో గానీ, పాపికొండల నేషనల్ పార్కులో గానీ పడవేయరాదని సూచించారు.° వన్యప్రాణులకు హాని కలుగుతుందని సూచించారు.

'ఉచిత ఇసుక పేదల పాలిట వరం'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రజల పాలిట వరమని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీపై ప్రజల అవగాహనకు ఇసుకతో నిండిన ట్రాక్టర్‌ను బుధవారం మంత్రి కొలుసు పార్థసారథి డ్రైవ్ చేస్తూ నూజివీడు పట్టణంలోని టిడిపి ఆఫీస్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు పట్టణంలోని ప్రధాన వీధులలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి

బుట్టాయగూడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు వేసి నివసిస్తున్న గిరిజన కుటుంబాలకి కరెంటు, మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కి ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యాన వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ 2 వేల ఇళ్ల స్థలాలు వేసి నివసిస్తున్న గిరిజన కుటుంబాలకి మంచినీరు, కరెంటు సౌకర్యాలు వెంటనే కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కరెంటు లేకపోవడంతో ఇల్లు లోపలికి పాములు వస్తున్నాయన్నారు. పంచాయతీ నుంచి కరెంటు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మరియమ్మ, నాగమణి, నాగరాజు ఉన్నారు.

మానవత సేవలు విస్తృత పరచాలి

జిల్లా కమిటీ సభ్యులు ఆప్పక రాంబాబు

భీమడోలు: స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవత శాఖ సేవలు మరింతగా పెంచాలని, మారుమూల ప్రాంతాలకు సైతం శాఖ సేవలు అందించేందుకు ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కమిటీ సభ్యులు ఆప్పక రాంబాబు కోరారు. 16 సంవత్సరాల క్రితం భీమడోలు కేంద్రంగా ఏర్పాటుచేసిన మానవత శాఖ విస్తృతస్థాయిలో సేవలను అందించడంతో పాటు ప్రతి సంవత్సరం వాటిని విస్తరిస్తుంది. ఈ క్రమంలో శాఖ కార్యవర్గ కమిటీ, పూర్వపు కార్యవర్గ సభ్యులుగా సలహా మండలి కమిటీలు, జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు ప్రముఖులతో కూడిన డైరెక్టర్ల కమిటీలను ఏర్పాటు చేశారు. అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పూళ్ల గ్రామానికి చెందిన వట్టి సుగుణాకర్, డైరెక్టర్లుగా పి.మధు, వి.ఏడుకొండలు, సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.రామారాయుడు, పి.సత్యనారాయణ రాజు, కె.రామకృష్ణం రాజు, వి.రాంబాబులతో కూడిన 9 మంది సభ్యులుగా గల డైరెక్టర్ల కమిటీని ఏర్పాటు చేశారు. వీరందరూ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రముఖులు పంచకర్ల సత్యనారాయణ హాజరయ్యారు.

కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ ప్రారంభం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం: 43 సంవత్సరాల నుంచి కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ నిర్మించాలనుకున్న కలను ఈరోజు కూటమి అధికారంలోకి రాగానే నిలబెట్టుకున్నామని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని గంగవరం గ్రామంలో బుధవారం ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ఎస్‌సి కమ్యూనిటీ ఫంక్షన్ హాల్‌కు రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. ఎంఎల్‌ఎగా గెలిచిన తరువాత తమ గ్రామంకు విచేస్తున్న ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఘన స్వాగతం కలికారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి పాల్గొన్నారు.

కౌలు రైతులందరూ పంటలసాగు హక్కు పత్రాలు పొందాలి

తహశీల్దార్ టి.సుభాష్

టి.నరసాపురం: కౌలు రైతులందరు తప్పనిసరిగా పంటలసాగు హక్కు పత్రాలు పొందాలని తహశీల్దార్ టి.సుభాష్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంటలసాగు హక్కు పత్రాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పలు సూచనలు అందించారు. అనంతరం ఎంపిడిఒ బి.సుమలత మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం 3495 మంది కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారాతో అప్రమత్తత

ఏలూరు టౌన్: అతిసారా, నీళ్ల విరోచనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు గర్భిణీ స్త్రీలు, వృద్ధులు వారి ఆహారపు అలవాట్లు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాపీ మేస్త్రి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సాయి లిఖిత సూచించారు. 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో భాగంగా టైటస్ నగర్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వర్షాకాలంలో అధిక వర్షాల వల్ల నీటి కలిషితం జరిగి నీళ్ల విరోచనాలు, అతిసారా, కామెర్లు, టైఫాయిడ్ మొదలగు జ్వరాలు ప్రభలే అవకాశము ఉందన్నారు. కావున ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

ముసునూరు: ముసునూరు గురుకుల పాఠశాలలో వచ్చే ఆదివారం పేరెంట్స్ డే కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే నిర్వహించబడుతుందని, ఆ తర్వాత తల్లిదండ్రులు పిల్లలను విడిచిపెట్టి పాఠశాల ఆవరణ నుంచి వెళ్లిపోవాలని పాఠశాల ప్రిన్సిపల్ కొండా బత్తుల ప్రవీణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ముసునూరు పరిసర ప్రాంతాల్లో డయేరియా(అతిసార వ్యాధి), డెంగీ వ్యాధులు వ్యాపించి ఉండటంతో ఈ నిర్ణయం ఉన్నతాధికారుల సూచనలతో తీసుకోవడం జరిగిందని, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ సహృద్భావంతో అర్థం చేసుకొని తమ పాఠశాల సిబ్బందికి సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

గోతులు పూడ్చివేత

టి.నరసాపురం: గత కొన్ని సంవత్సరాలుగా టి.నర్సాపురం పంచాయతీలో ఉన్న ఇందిరా కాలనీ వెళ్లే దారిలో వర్షపు నీటితో నిండి దారి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో టి.నరసాపురం జనసేన నాయకులు ఆ రోడ్డులో గోతులు పూడ్చించి వర్షపునీరు తొలగించారు. మట్టితో బాగు చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో జనసేన ముందుంటుందని నాయకులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో టి.నర్సాపురం పంచాయతీ జనసేన అధ్యక్షులు పాలేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణకు ప్రాధాన్యత

ఎంపిడిఒలతో సమీక్షలో ఎంఎల్‌ఎ ధర్మరాజు

ఉంగుటూరు: వర్షాకాలం కాబట్టి గ్రామాల్లో, వీధులు, రహదారుల వెంబడి మురుగు, వరద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అధికారులను ఆదేశించారు. ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన ఎంపిడిఒలతో ఆయన నారాయణపురం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. కచ్చా డ్రెయిన్లు మురుగు నీరు నిల్వలేకుండా పూడికలను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులతో తీయించాలన్నారు. ఎంపిడిఒలు శర్మ, స్వర్ణలత, నిడమర్రు ఇఒపిఆర్‌డి చంద్రశేఖర్, ఎఒ ఆంజనేయులు పాల్గొన్నారు.

పురుగుమందుల విక్రయంలో నిబంధనలు తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, ఎరువులు, పురుగుమందులు కొన్న ప్రతి రైతుకు బిల్లులను ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు అన్నారు. బుధవారం ఆగిరిపల్లి వ్యవసాయ కార్యాలయంలో మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్లకు సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లందరూ ఇ-పాస్ మిషన్ల ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని, అధీకృత డిస్ట్రిబ్యూటర్ ద్వారానే కోనుగోలు చేసి విక్రయించాలని, డీలర్లందరూ స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్‌లు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పెద్దపీట

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పునరుద్ఘాటించారు. ఏలూరులో ప్రజా వినతులు స్వీకరించిన ఆయన ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం, పరిష్కారమార్గాలు చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఒకపక్క కార్పొరేషన్ అధికారులతో రివ్యూలు, ఇంకోపక్క ప్రజా వినతులు స్వీకరించడం, మరో పక్క ఆయా సమస్యలున్న ప్రాంతాలకు నేరుగా చేరుకుని స్వయంగా పరిశీలన చేయడం ఇలా టిడిపి తొలి నుంచి వస్తున్న ప్రజల వద్దకే పాలనా విధానాన్ని పక్కగా అమలు చేస్తూ వస్తున్నారు. ఇదేక్రమంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు తమ సమస్యలను ఎంఎల్‌ఎ బడేటి చంటి దృష్టికి తీసుకువచ్చారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా వినతులు స్వీకరించి, క్షుణ్ణంగా ఆయా సమస్యలను తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పలువురు ఎంఎల్‌ఎను దుశ్శాలువా, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. పలువురు డ్వాక్రా మహిళలు తమ సమస్యలు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ విన్న ఎంఎల్‌ఎ చంటి నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అనేక ప్రజా సంస్కరణలకు రూపకల్పన చేసిందన్నారు. ప్రతీ కార్యక్రమం ప్రజోపయోగకరంగా రూపుదిద్దుతున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం నాగరాజు పాల్గొన్నారు.

ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలి

డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ మైసన్నగూడెం గ్రామంలో 13వ సర్వే నెంబర్లు గల 103 ఎకరాల 40 సెంట్లు ప్రభుత్వ చెరువును గత కాలంగా నీటి కట్టు సంఘం పేరుతో రూ.లక్షలు అక్రమంగా వేలంపాట జరిపి నీటి కట్టు సంఘం సభ్యులు సంవత్సరానికి రూ.5 లక్షలు అక్రమంగా దోచుకుంటున్నారని, ఆ అక్రమ వేలంపాటను ఆపి చట్టబద్ధంగా ప్రభుత్వ నిబంధనలతో ఫిష్ అండ్ ఇరిగేషన్ పంచాయతీ పరిధిలో చట్టబద్ధంగా వేలంపాట జరిపి గ్రామస్తులు పాడుకునేందుకు అవకాశం కల్పించాలని జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కెవి.ప్రసాద్‌కు గత నెల రోజులుగా ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదును పక్కదోవ పట్టించి నీటి సంఘం వారితో కొమ్మక్కై మైసన్న గూడెం గ్రామ సచివాలయం పరిధిలో చట్టబద్ధంగా వేలంపాట జరిపేందుకు వీలులేదని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎఇ భాస్కర్, మండల ఎంపిడిఒ కెవి.ప్రసాద్ చట్టాన్ని అమలు చేయవలసిన అధికారులు చట్టవిరుద్ధంగా నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటని అధికారుల వైఖరిని దుయ్యబెట్టారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే గత మూడు సంవత్సరాల కాలంగా అక్రమంగా 13 ఎకరాల ప్రభుత్వ చెరువును వేలంపాట జరిపి నీటి సంఘం పేరుతో సొంత ప్రయోజనాలకు ఖర్చు పెట్టుకున్న రూ.10 లక్షలను ప్రభుత్వానికి చెల్లించాలని డిమాండ్ చేశారు.

డ్రెయిన్ ప్రక్షాళనకు సహకరిస్తాం

పరిశ్రమల యాజమాన్యం హామీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు రైల్వే గేటు రోడ్డులో ఇరిగేషన్ డ్రెయిన్‌లో మురుగునీరు నిల్వ లేకుండా పరివాహక పరిశ్రమల యాజమాన్యం హామీ ఇచ్చారు. ఇరిగేషన్ బోదెలో పరిశ్రమల వ్యర్థాలు కథనాన్ని జూన్ 17న ప్రజాశక్తి ప్రచురించింది. దీంతో పంచాయతీ పాలకవర్గం, అధికారులు, ఆరోగ్య సిబ్బంది ఆయా పరిశ్రమలకు లిఖిత పూర్వకంగా నోటీలు ఇచ్చారు. అనంతరం రెండో దఫా ఫ్యాక్టరీ నిర్వాహకులు, ప్రతినిధులు ఈనెల 10వ తేదీన ఉంగుటూరు పంచాయతీ కార్యాలయానికి రావాలని లేఖ ఇచ్చారు. ఈక్రమంలో గ్రామ సర్పంచి బండారు సింధు అధ్యక్షతన బుధవారం పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి, ఫ్యాక్టరీ నిర్వాహకులు హాజరయ్యారు. డ్రెయిను కలుషితం అయిన రంగుమారి దుర్వాసన, దోమలతో జనం పడుతున్న సమస్యలను సర్పంచి, కార్యదర్శి వివరించారు. ఇప్పటి వరకూ పరిశ్రమల యజమానులంతా ఒక చోట సమావేశం అవడం కుదరలేదని, ఇప్పుడు పంచాయతీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో మూడు నాలుగు రోజుల్లో కార్యాచరణ రూపొందించి పారిశుధ్యానికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు కార్యదర్శి కాకర్ల గిరిధర్ చెప్పారు. ఉప సర్పంచి పాతూరి జగదీష్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఇప్పటికైనా పర్యావరణ కలుషితం కాకుండా పారిశుధ్య నిర్వహణ పట్ల శ్రద్ధ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలి

రైతు రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి

ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని, అన్నదాతలు అప్పుల ఊబిలో ఉన్నారని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం ద్వారకాతిరుమల మండలంలోని ఎం.నాగులపల్లిలో కూరగాయల ఉత్పత్తిదారుల సంఘ భవనం హాలులో రైతుసంఘం జిల్లాస్థాయి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తొలుత ప్రారంభ సభకు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి కేశవరావు మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభానికి పాలకుల విధానాలే కారణమని విమర్శించారు. వ్యవసాయ నష్టాలతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాల్సి ఉన్నా ఆ విధంగా మద్దతు ధరలు నిర్ణయించడం లేదని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలన్నారు. నష్టాల్లో ఉన్న రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు రక్షణకు, వ్యవసాయరంగ పరిరక్షణకు అన్నదాతలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంటల రైతాంగ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, బోయపాటి సత్యనారాయణ, బొడ్డు రాంబాబు, సున్నా భూలక్ష్మి, కౌలురైతు సంఘం జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, ఎం.నాగులపల్లి కూరగాయల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు నందమూరి త్రినాథ సుబ్బారావు పాల్గొన్నారు.

సొమ్ము పోయే, స్థలము పోయే..!

బాధితుడు ఆవేదన

ప్రజాశక్తి కథనంతో వెలుగు చూస్తున్న వాస్తవాలు

ముదినేపల్లి: ఇచ్చట స్థలాలు అమ్మబడును అనే శీర్షికతో ప్రజాశక్తితో సోమవారం వెలువడిన వార్తకు పలువురు నుంచి ప్రశంసలు వస్తుండగా, మరోపక్క ఒక వ్యక్తి వద్ద నుంచి ప్రభుత్వ స్థలాన్ని కొనుగోలు చేసి మోసపోయిన ఓ బాధితుడు ప్రజాశక్తి విలేఖరి వద్ద బుధవారం తన గోడు విన్నవించుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లికి చెందిన ఓ వ్యక్తి ముదినేపల్లి సంత మార్కెట్‌లో జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకునేందుకుగాను సంత మార్కెట్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి వద్ద నుంచి రూ.50 వేలుకు స్థలం కొనుగోలు చేసాడు. కొంతకాలం పాటు ఆ స్థలంలో స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి తన వ్యాపారం సక్రమంగానే నిర్వహించాడు. సదరు వ్యక్తి వ్యాపారం బాగా సాగుతున్న తరుణంలో గతంలో తనకు స్థలం అమ్మిన వ్యక్తి అనుచరులు(ఆ వ్యక్తులను నవరత్నాలు అంటారు) ఈ స్థలం మాది, నీకు ఈ స్థలం ఎవరు అమ్మిన్నారో మాకు తెలియదు అంటూ తనపైకి దౌర్జన్యంగా వచ్చి స్థలం ఖాళీ చేస్తావా, లేదా, లేకుంటే నీ అంతూ చూస్తామంటూ బెదిరించినట్టు తెలిపాడు. దీంతో సదరు వ్యక్తి (నవరత్నాలకు) భయపడి చేసేదిలేక విషయాన్ని గ్రామ ప్రముఖుల వద్దకు తీసుకువెళ్లగా వాళ్లు కూడా తనకు న్యాయం చేయలేదని, ఈ విషయాన్ని మీరే తెల్చుకోవాలి తప్ప మేమేం చేయలేమని సదరు వ్యక్తులు చేతులెత్తేసినట్లు బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో తాను చేసేది లేక రూ.50 వేలతో కొనుగోలు చేసిన స్థలాన్ని, తనకు స్థలం అమ్మిన వ్యక్తి అనుచరులకు వదిలేసినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఇలాంటి బాధితులు ఎంతమంది ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసి మోసపోయారో వేచి చూడాలి మరి.

గోదావరి వరద జలాలు విడుదల

పోలవరం : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు బుధవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.022 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెలలో ఇప్పటి వరకూ 2.9260 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కలిదిండి: మండలంలోని చిన తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాసవీ క్లబ్ జిల్లా జోన్ ఛైర్‌పర్సన్, మానవత కలిదిండి డైరెక్టర్ నూకల శ్యామలరావు గుప్తా ఆర్థిక సాయంతో నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు కలిదిండి మానవత సేవా సంస్థ అధ్యక్షులు పూర శ్రీధర్ అన్నారు. చిన తాడినాడ అంగన్వాడీ కేంద్రానికి టేబుల్ అందజేశారు.

పరంపూడిలో డ్రెయినేజీ పూడికతీత పనులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి పంచాయతీ పరిధిలో బుధవారం చింతాలమ్మతల్లి గుడి రోడ్డులో డ్రెయినేజీ పూడికతీత పనులు, సత్యసాయి బాబా గుడి రోడ్డులో డ్రెయినేజీ పూడికతీత పనులు నిర్వహించారు. అనంతరం పూడికతీతలో వచ్చిన మట్టిని ట్రాక్టర్లలో డంపింగ్ యార్డ్‌కు తరలింపు కార్యక్రమాలు చేపట్టారు. ఈ పనులను ఇఒపిఆర్‌డి సతీష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి పంచాయతీ పరిధిలోని డ్రెయిన్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన కట్టడాలను పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించే పనులు అధికారులు చేపట్టారు. ఇచ్చట స్థలాలు అమ్మబడును, ఆక్రమణలో ప్రభుత్వ స్థలాలు అనే వార్త ఈనెల ఎనిమిదో తేదీ ప్రజాశక్తిలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. దీంతో ముదినేపల్లిలోని ప్రధాన రోడ్డు వెంబడి డ్రెయినేజీలు ఆక్రమించి డ్రెయిన్లపై వ్యాపారులు, పక్క నిర్మాణాలు చేపట్టిన నిర్మాణాలను, కట్టడాలను పంచాయతీ ఆధ్వర్యంలో ప్రొక్లైన్‌తో తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం ఆక్రమణ తొలగింపు ప్రారంభించింది. వెంటనే పక్క సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టి మురుగునీటి సమస్యను పరిష్కరించనున్నట్లు కార్యదర్శి రమేష్ తెలిపారు.